# మినీకథ

# ముగింపు మీకూ తెలుసు

ఎం. రామకృష్ణ



కోనేటిరావుకు కొండెక్కినంత సంతోష మైంది. ఇంకోరకంగా చెప్పాలంటే లాటరీలో లక్ష రూపాయలు తగిలినట్లయింది. పుట్టి పెరిగి పెద్దవాడై నందుకు సగర్వంగా తలెత్తుకు తిరగగలిగినంత ఒక మహా ఘనకార్యం చేసినవాడిలా ఫీలయ్యాడు. కనబడ్డ కనకయ్యలకు, దారిన పోయే దానయ్యలకు, పరిచయమంటూ వున్న పేరయ్యలకూ అదేపనిగా చెప్పాడు. ఏడిచిపోతాడని దయవచ్చిన వాళ్ళు ముక్కుమీద వేలేసుకోకుండానే "సీత" అంటే. మొగమాటంలేని కొందరు "మంచి"దంటూ దాటుకపోయారు పూర్తిగా వినకైనా వినకుండానే. మరికొందరు తెలివిగలవాళ్ళు యిదే అదనుగా "పార్టీ" పేరిట పాతిక, యాభై ఖర్చు పెట్టించేశారు కోనేటిరావు చేత. ఏ మాటకామాటే చెప్పాలి. అన్ని విధాల అనుకూలవతి అని పేరుపొందిన కోనేటిరావు భార్య కోటి రత్నం కూడా యథావిధి కోనేటిరావు ప్రోపగాండాలో పాలుపంచుకుంది.

అసలు దీని కంతటికి కారణం- వరుసగా ఐదుగురు ఆడపిల్లల తర్వాత ఆరవసారి కోనేటిరావుకు 'కొడుకు' పుట్టాడు (అంటే కోటిరత్నానికి). ఆంధ్రుడైన ప్రతివాడు గర్వించదగ్గ విషయం ఇంతకంటె ఏముంటుంది? కోనేటిరావు కూడా ఆంధ్రుడే కాబట్టే ఇంత హడావిడి చేశాడు. తప్పేం లేదు. అందునా పట్టు వదలని విక్రమార్కుడిలా విసిగిపోక కోర్కె నెరవేర్చుకున్నందుకు.

పుట్టిన ఘడియ, తేదీ, వార నక్షత్రాలు స్వయంగా గడియారం (పంచాంగం కూడా) దగ్గర పెట్టుకొని మరీ వ్రాసుకున్నాడు. పాపం కోనేటిరావుకి అదో రకమైన నమ్మకం. ఐదుగురు ఆడపిల్లల జాతకాలు కూడా ఇంత జాగ్రత్తతోనే వ్రాశాడుగాని పుట్టింది ఆడపిల్ల అని తెలియగానే నీరుగారిపోయి ఎక్కడో పెట్టేశాడు. పున్నామ నరకం నుంచి తప్పించేది పుత్రుడుగానీ, పుత్రికని ఎక్కడా శాస్త్రాల్లో చెప్పలేదుగదా.

అయితే కోనేటిరావుగారి కొండంత సంతోషం అవధాన్లుగారిమాటలు వింటుంటే తరిగిపోసాగింది.

"మంచైనా చెడైనా చెప్పటం నా ధర్మం. అందుకని నేను వున్నది వున్నట్లుగానే చెప్పక తప్పదు" అన్నారు అవధాన్లుగారు. కోనేటిరావు గుటకలు మింగాడు.

"ఏ రకంగా చూచినా ఈ కుర్రాడి జాతకం అంత బాగాలేదు. ఉండాల్సిన అవలక్షణాలన్నీ వున్నాయి. తాగుడు, వ్యభిచారం, జులాయితనం..."

కోనేటిరావు ముఖం ఇబ్బందిగా పెట్టటం చూసి అవధాన్లుగారు ఆగిపోయారు.

"ఏమయినా శాంతులు, పూజలు, పునస్కారాలు...."

"అదిగూడా చూశాను. ఏం చేసినా ఇతని జాతకంలో మార్పుండే సూచనలేం లేవు. అయినా చేయించండి—ఆపై ఆ భగవంతుడి దయ" అన్నాడు కొద్దిగా చిరునవ్వు నవ్వుతూ. ఆచిరునవ్వుతనకు అర్థంకాలేదు. 'బహుశా తనపరిస్థితికి నవ్వుతున్నాడేమో' అనుకొన్నాడు కోనేటిరావు.

ముఖం వ్రేలాడేసుకొని వచ్చిన మొగుణ్ణి చూసి కోటిరత్నం కంగారుపడింది. "ఏ మైందండీ? ఎందుకు అలా వున్నారు?" అన్న ప్రశ్నకు మొదట తలాయించాడుగాని చివరకు అందరూ నిద్ర కొదిగిన తర్వాత చెప్పక తప్పలేదు. కోటి రత్నం గుండెలు బరువైనాయి. "లేక లేక ఓ లోకాయ పుడితే ఈ కర్మేమిటండీ?" ఆమెతీవ్రంగాఏడిచింది. "అయినా అవధాన్లు చెప్పిన వన్నీ నిజయమవుతాయా? అన్ని జ్యోతిష్కాలూ ఫలిస్తాయా" అని భర్తకు ధైర్యం చెప్పింది. తనకు తనే ధైర్యం నూరిపోసుకొంది. "అసలు పుట్టిన ఘడియలు సరిగ్గా చూసుకున్నారా?" అంటూ భర్తను అనుమానించింది కూడాను.

పదకొండో రోజు శాంతులు, పూజలు, దానాలు ముమ్మరంగా చేసేశారు ఇద్దరు దంపతులూ కలిసి. ఎందుకయినా మంచిదని నూనెలో మొఖం చూశాడు కోనేటిరావు.

కోనేటిరావుకు మాత్రం అవధాన్లుమీది గురికి తిరుగులేదు. చేయగలిగిందేమీ లేకపోవటంచేత, ఆశ నిరాశలతో రోజులు గడిపారు ఆ దంపతు లిద్దరూ.

ఆ తర్వాత దాదాపు ముప్పై అయి యేళ్ళు గడిచినతర్వాతగానీ అవధాన్లుగారు నవ్విన నవ్వుకు అర్థమేమిటో తెలిసింది కాదు కోనేటిరావుకు.

బహుశా ఈపాటికి మీకు అర్థమైవుంటుందనుకొంటాను. అవధాన్లుగారు ఎందుకు నవ్వారో! అర్థంకాలేదంటారా?

అయితే వినండి.

శ్రీ కుటుంబరావుగారు-అంటే కోనేటిరావుగారి ఏకైకపుత్రుడు యింతై, అంతై ఒక వింతై, చివరికి మంత్రై కూర్చున్నాడు.